
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
విజయనగరం
జిల్లా వార్తలు
ఆదివారం 24 ఆగస్టు 2025







టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

కొలువుల పంట

- తీపి కబురు అందించిన ప్రభుత్వం
- డీఎస్సీ మెరిట్ లిస్ట్ విడుదల
- ధ్రువపత్రాల పరిశీలనకు రంగం సిద్ధం





సాలూరు రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం తీపికబురు అందించింది. చెప్పిన విధంగానే మెగా డీఎస్సీలో అభ్యర్థుల మెరిట్ లిస్ట్ శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో వెల్లడించింది. ధ్రువపత్రాల పరిశీలనకు రంగం సిద్ధం చేస్తోంది. ఇదిలా ఉండగా వివిధ కేటగిరీ పోస్టులకు జోన్ ఆఫ్ కన్సిడరేషన్ లోకి వచ్చిన అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌కు కాల్‌లెటర్లు పంపుతారు. వాటిని వారు డౌన్‌లోడ్ చేసుకొని అందులో సూచనలు పాటించాలి. కేటాయించిన తేదీ, సమయానికి ధ్రువపత్రాల పరిశీలనకు తప్పకుండా హాజరు కావాల్సి ఉంది. పోస్టులకు ఎంపిక పూర్తిగా ప్రతిభ, అర్హత, నియమ నిబంధనలకు ఆధారంగా జరుగుతుందని మెగా డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలనకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి ఎంఈవోలు, ఎల్‌డీఏలు, కంప్యూటర్లు ఆపరేటర్లతో కూడిన 24 మంది బృందం ఈ నెల 20న విజయవాడలో శిక్షణ పొందింది.

ఇదీ పరిస్థితి..

- పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో 583 టీచర్ ఖాళీలతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. మున్సిపల్, జడ్పీ, ఎంపీపీ,ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్జీటీలు 210, పాఠశాల సహాయకులు క్యాడర్‌లో తెలుగులో 14, హిందీలో 14, ఆంగ్లంలో 23, గణితంలో 8, భౌతికశాస్త్రంలో 32, జీవశాస్త్రంలో 20, సాంఘిక శాస్త్రంలో 62, పీఈటీ 63 మొత్తం 446 టీచర్ ఖాళీలు చూపారు. ట్రైబల్ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలల్లో ఎస్జీటీలు 60 పాఠశాల సహాయకుల క్యాడర్‌లో ఆంగ్లంలో 7, గణితంలో 25, భౌతిక శాస్త్రంలో 24, జీవశాస్త్రంలో 16, సాంఘిక శాస్త్రంలో 5 మొత్తం 137 టీచర్ పోస్టులు ఖాళీలను చూపించారు.
- ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది జూన్ ఆరు నుంచి జూలై 2 వరకు 23 రోజుల పాటు రెండు సెషన్లలో మెగా డీఎస్సీ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల వ్యక్తిగత స్కోరు కార్డులను ఈ నెల 11న ప్రకటించారు. నేరుగా ఎంపిక జాబితాతో పోస్టుల భర్తీకి సన్నాహాలు చేశారు. అయితే మెరిట్ ప్రకటించాలని అభ్యర్థులు కోరారు. వారి కోరిక మేరకు పోస్టుల భర్తీలో పారదర్శకత కోసం విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆదేశాలతో మెరిట్ లిస్ట్‌ను ప్రకటించారు. ఈ లిస్ట్‌లో ఉన్నవారంతా పోస్టులకు ఎంపికయినట్టు కాదు. భర్తీలో పారదర్శకత, ఎటువంటి అపోహాలు కలగకుండా ఉండేందుకు మెగా డీఎస్సీలో ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయో తెలుసుకోవడానికి ఈ జాబితా వెల్లడించారు.
- ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరీల కింద 18,001 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 16 వేల మంది పైబడి పరీక్షలకు హాజరయ్యారు. అత్యధికంగా ఎస్జీటీ పరీక్షకు హాజర య్యారు. ఎజ్జీటీ మెరిట్ జాబితా7,725 మందితో ప్రకటించారు. పాఠశాల సహాయకుల కేటగిరీలో ఆంగ్లానికి 665 మందితో, గణితంలో 1497 మంది, ఫిజికల్ సైన్స్‌లో 1398 మందితో, సోషల్‌లో 2618 మంది, తెలుగు 885 మంది,

(మిగతా 6వ పేజీలో...)

టంగుటూరి జీవితం
భావితరాలకు ఆదర్శం

- జయంతి కార్యక్రమంలో కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం భావితరాలకు ఆదర్శమని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో టంగుటూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి కలెక్టర్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికంలో పుట్టి, పూట కూళ్లల్లో పనిచేస్తూ, ఉన్నత విద్యావంతునిగా, పత్రికా సంపాదకునిగా, ప్రజా నాయకుడిగా, స్వాతంత్ర్య సమరయోదుడిగా, ముఖ్యమంత్రిగా ఎదిగి.. సంపాదించిన దాన్ని ప్రజలకే పంచిపెట్టి పేదవారిగా మరణించిన మహనీయుడు టంగుటూరి అని కొనియాడారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శమన్నారు. జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ.. సైమన్ గో బ్యాక్ నినాదంతో బ్రిటీష్ వారికి ఎదురొడ్డి గుండె చూపిన ధైర్యశాలి టంగుటూరి అన్నారు. రైతుల కోసం అనేక ప్రాజెక్టులు చేపట్టారని, వాటి ఫలాలను రైతులు నేడు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, కలెక్టరేట్ ఏవో తాడ్డి గోవింద, సీపీవో బాలాజీ, వ్యవసాయాధికారి తారకరామారావు, మార్కెట్ ఫెడ్ డీఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త మాస్టార్లు

- ప్రతిభ చూపిన ఉమ్మడి జిల్లా యువత
- రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో మంచి ర్యాంకులు
- ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హత

4లో



ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ జరుపుతున్న జిల్లా అధికారులు

కోనమసివానిపాలెం
‘ఉపాధి’ ఎఫ్‌ఏపై విచారణ

- దొంగ మస్తర్లతో కాజేసిన నిధులు
- రూ.కోటి వరకు అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు
- విచారణ సమయంలో ఎఫ్‌ఏ వర్గీయుల గొడవ
- పోలీసుల రంగప్రవేశం

లక్కవరపుకోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనమసివానిపాలెం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ బండ అప్పారావుపై జిల్లా అధికారులు శనివారం విచారణ చేపట్టారు. దొంగ మస్తర్లతో ఉపాధి నిధులు కాజేసినట్లు ఎఫ్‌ఏ అప్పారావుపై అదే గ్రామానికి చెందిన కాకర శ్రీనివాసరావు గత నెలలో ఉన్నతాధికారులకు (మిగతా 6వ పేజీలో..)

టీడీపీ జిల్లా రథసారథి ఎవరో?

- 26న త్రీమెన్ కమిటీ రాక
- అదే రోజు ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులతో సమావేశం
- పార్టీ అధ్యక్షుడి ఎంపికపై తెలుసుకోనున్న అభిప్రాయాలు
- అధిష్ఠానానికి ఇవ్వనున్న ఆశావహుల జాబితా

విజయనగరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా రథసారథి ఎవరు.?. ప్రస్తుతం ఉన్న కిమిడి నాగార్జునకే మళ్లీ అవకాశం ఉంటుందా?.. లేక కొత్తవారికి చాన్స్ దక్కుతుందా? అన్నది త్వరలో తేలనుంది. దీనిపై జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు అధిష్ఠానం నియమించిన త్రీమెన్ కమిటీ ఈ నెల 26న జిల్లాకు రానుంది. పోటీలో ఉన్న ఆశావహుల జాబితాను అధిష్ఠానానికి సమర్పించనుంది.

కార్యవర్గాల ఎంపికపై దిశా నిర్దేశం

తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. గ్రామ, వార్డు, డివిజనల్, మండల, పట్టణ, నగర కమిటీలు, అనుబంధ కమిటీల ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఇక పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు, కార్యవర్గం, అనుబంధ సంఘాల కమిటీల ఎంపిక ప్రక్రియ ఈ నెలఖరులోగా ముగియనుంది. ఎంపికైన కమిటీలకు అధిష్ఠానం ఆమోదముద్ర వేసి, సెప్టెంబరు నెల 3న రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర కార్యవర్గాలను అధికారికంగా ప్రకటించనుంది. జిల్లా స్థాయి కమిటీ అధ్యక్షుడు, ఇతర కార్యవర్గ సభ్యుల ఎంపిక, పార్టీ పరిస్థితులపై అంచనా వేసేందుకు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ముగ్గురితో కూడిన (త్రీమెన్) కమిటీలను రాష్ట్ర టీడీపీ నియమించింది. ఈ త్రీమెన్ కమిటీలతో శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమావేశమై కార్యవర్గాల ఎంపికపై దిశా నిర్దేశం చేశారు.

- విజయనగరం పార్లమెంట్ నియోజకవరానికి సంబంధించి నియమించిన త్రీమెన్ కమిటీలో టీడీపీ సీనియర్ నాయకుడు మహ్మద్ అహ్మద్ షరీఫ్, పీజీవీఆర్ నాయుడు (గణబాబు), వాసంశెట్టి సుభాష్ ఉన్నారు. ఈ కమిటీ ఈ నెల 26న విజయనగరం రానుంది. టీడీపీ జిల్లా అధ్యక్షుడి ఎంపికకు సంబంధించి ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకోనుంది. ఆశావహుల జాబితాను పార్టీ రాష్ట్ర (మిగతా 6వ పేజీలో..)

హౌసింగ్ బిల్లులకు ఎదురుచూపు

- టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణం
- 5,186 గృహాలకు రూ.15.32కోట్ల బిల్లులు పెండింగ్
- చెల్లించని గత వైసీపీ సర్కారు
- కూటమి ప్రభుత్వంపైనే లబ్ధిదారుల ఆశలు



సంతకవిటి మండలం చిత్తారపురం ఎన్టీఆర్ కాలనీ

చెల్లించాల్సిన బిల్లుల వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారులు	బిల్లులు (రూ.కోట్లలో)
రాజాం	1531	రూ.4.2
బొబ్బిలి	803	రూ.2.31
నెల్లిమర్ల	762	రూ.2.52
చీపురుపల్లి	498	రూ.1.53
ఎస్.కోట	662	రూ.1.99
గజపతినగరం	642	రూ.1.97
విజయనగరం	192	రూ.68లక్షలు

- గృహ నిర్మాణం విషయంలో వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం చేసింది. జగనన్న కాలనీల పేరిట నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద కట్టిన ఇళ్లకు బిల్లులు చెల్లించలేదు. రాజకీయ కక్షతోనే ఈ పని చేసింది. అందుకే ఎన్టీఆర్ గృహనిర్మాణానికి సంబంధించి పెండింగ్ బిల్లులు పూర్తిగా చెల్లిస్తాం.

- గత ఏడాది ఆగస్టులో సీఎం చంద్రబాబు చేసిన ప్రకటన ఇది.

రాజాం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బిల్లుల కోసం ఎన్టీఆర్ గృహ లబ్ధిదారులకు ఎదురుచూపు తప్పడం లేదు. మొత్తం రూ.15.32కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయి. బిల్లులు చెల్లిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చి ఏడాది అవుతున్నా ఇంకా అమలుకు నోచుకోకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేసింది. ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు సబ్‌ప్లాన్ నిధులను రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకూ అదనంగా మంజూరు చేసింది. 2014 నుంచి 2017 వరకూ మంజూరైన ఇళ్లకు బిల్లుల చెల్లింపులు సక్రమంగానే జరిగాయి. ఆ తరువాత బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగింది. ఇంతలో ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ రావడంతో చెల్లింపులు నిలిచిపోయాయి. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ పెండింగ్ బిల్లులు చెల్లించలేదు. అప్పటి నుంచి లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాకు (మిగతా 6వ పేజీలో..)

ఏమైందో ఏమో?

- అనుమానాస్పదస్థితిలో భార్యాభర్తల మృతి
- ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసుల అనుమానం
- పెళ్లయిన ఎనిమిది నెలలకే ఘటన



చిరంజీవి, వెంకటలక్ష్మి(ఫైల్)

కొత్తవలస, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అప్పన్నదొరపాలెం పంచాయతీ తమ్మన్న మెరక గ్రామంలో భార్యాభర్తలు అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన ఘటన శనివారం ఉదయం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి సీఐ షణ్ముఖరావు, స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడుమెరక గ్రామానికి చెందిన గీతల వెంకట లక్ష్మి (28), వేపాడ మండలం చినదుంగాడ (కొప్పలవానిపాలెం) గ్రామానికి కొప్పల చిరంజీవి(30) ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఒకే గిరిజన సామాజిక వర్గానికి చెందిన వీరు ఎనిమిది నెలల కిందట తమ పెద్దలను ఒప్పించి కొప్పలవానిపాలెంలో వివాహం చేసుకున్నారు. తరువాత కొద్ది రోజులకు తమ్మన్నమెరక గ్రామానికి వచ్చి అక్కడే జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. చిరంజీవి విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం రామవరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, వెంకటలక్ష్మి కొత్తవలసలోని ఓ ప్రైవేట్ స్టోర్‌లో పని చేస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం వారి బంధువులు తమ్మన్నమెరకలోని చిరంజీవి ఇంటికి వచ్చారు. అక్కడ చిరంజీవి ఉరేసుకుని విగతజీవిగా కనిపించగా, వెంకటలక్ష్మి కిందపడి మృతిచెంది ఉండడంతో గ్రామపెద్దలకు సమాచారం ఇచ్చారు. దీనిపై గ్రామ సర్పంచ్ జోడు రాములమ్మ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కొత్తవలస సీఐ షణ్ముఖరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విజయనగరం నుంచి క్లూస్‌టీం సిబ్బంది వచ్చి ఇంట్లో వేలి ముద్రలను సేకరించారు.

మనస్పర్థలే కారణమా?

చిరంజీవి, వెంకటలక్ష్మి మధ్య గత కొద్ది రోజులుగా మనస్పర్థలు ఏర్పడడంతో రాత్రి వేళల్లో వారు గొడవలు పడుతున్నట్లు తెలిసింది. దీంతో భర్త చిరంజీవి భార్యను ముందు హత్య చేసి, తరువాత తాను ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లేదా వీరిని ఎవరైనా హత్య చేశారా? అనేది తెలియడం లేదు. అయితే, హత్య చేసేంత (మిగతా 6వ పేజీలో..)



వివరాలు సేకరిస్తున్న సీఐ షణ్ముఖరావు

సమన్వయంతో సేవలు అందించాలి
- సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి
- నేర సమీక్షలో డీఐజీ గోపీనాథ్ జెట్టీ

4లో

ఆస్పత్రికి మంచిరోజులు వచ్చేనా?
- శిథిలమైన భవనంలో సేవలు
- అర్థాంతరంగా నిలిచిపోయిన నూతన భవనం
- ఇదీ శంబర పీహెచ్‌సీ పరిస్థితి

4లో

వంశధార నదిలో మహిళ గల్లంతు

5లో

రెండున్నరేళ్లయినా పూర్తికాలే!

- చీపురుపల్లి ఆర్వోబీ పనుల్లో జాప్యం
- పరిష్కారంకాని సర్వీసు రోడ్డు వివాదం
- అధికారులు, ప్రజాప్రతినిధుల్లో కొరవడిన ముందుచూపు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



ట్రాక్‌పై వంతెన పనులు ఇలా..

చీపురుపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) పనుల్లో జాప్యం జరుగుతోంది. పనులు ప్రారంభించి రెండున్నరేళ్లు దాటుతున్నా ఇంకా పూర్తి కాలేదు. సర్వీసు రోడ్డు వివాదం పరిష్కారం కాకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల ముందుచూపు లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఫలితంగా చీపురుపల్లి మీదుగా రాజాం వైపు వెళ్లే ప్రయాణికులు నరక యాతన పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

చీపురుపల్లి పట్టణానికి (మిగతా 6వ పేజీలో)

కొత్త మాస్టార్లు

● ప్రతిభ చూపిన ఉమ్మడి జిల్లా యువత
● ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హత

మెగా డీఎస్సీలో ఉమ్మడి జిల్లా యువత మంచి ప్రతిభ కనబరిచారు. తమ ఆశయాన్ని నెరవేర్చుకోవడంతో పాటు తల్లిదండ్రుల కలలు నిజం చేశారు. కొందరు తాము అనుకున్న పోస్టులకు అర్హత సాధిస్తే.. మరికొందరు ఒకేసారి మూడు నాలుగు విభాగాలకు ఎంపికయ్యారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో మంచి ర్యాంకులు సాధించారు.

మూడు పోస్టులకు అర్హత


సాలాపు ఆనంద్

గజపతినగరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): లోగిస గ్రామానికి చెందిన సాలాపు ఆనంద్ శనివారం వెలువడిన డీఎస్సీ ఫలితాలలో 3 ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. ప్రస్తుతం రైల్వేలో ఉద్యోగం చేస్తున్న ఆయన టీచర్ కావాలన్న పట్టుదలతో చదివాడు. ఎస్ఏగా జిల్లాలో 4వ ర్యాంక్, పీజీటీ మ్యాథ్స్‌లో 10, టీజీటీలో 59వ ర్యాంక్ సాధించాడు. ఆనంద్ తల్లిదండ్రులు బొమ్మి నాయుడు, లక్ష్మిలు మృతి చెందగా.. తన తాతయ్య, అమ్మమ్మ శనపతి కృష్ణ, సత్యవతిల వద్ద పెరిగారు. 2023లో రైల్వేలో గ్రూప్-డి ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం బొబ్బిలిలో రైల్వే ట్రాక్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భార్య సాయిసత్య సాలూరు మున్సిపల్ హైస్కూలులో ఉపాధ్యాయిని. టీచర్ కావాలన్న లక్ష్యంతో కష్టపడి చదివి మూడు పోస్టులు సాధించినట్లు ఆనంద్ తెలిపారు.

కెంగువలో ఆరుగురికి ...

కెంగువ గ్రామంలో ఆరుగురు అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన మజ్జి భార్గవి, మిత్తిరెడ్డి అప్పలనాయుడు, బండారు ఈశ్వరరావు, లోగిస కృష్ణవేణి, గుడివాడ సత్యారావు, మజ్జి సౌభాగ్యలక్ష్మి డీఎస్సీలో వివిధ పోస్టు లకు ఎంపికయ్యారు. వీరిని గ్రామస్థులు అభినందించారు. గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన బోను సూర్యకుమారి, ముచ్చర్లకు చెందిన బీజీబీఎస్ శ్రీనివాస్ (10వ ర్యాంక్) టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు.

గణేష్‌కు రెండో ర్యాంక్


గణేష్

గరివిడి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గడబవలస గ్రామానికి చెందిన ఎల్లంటి గణేష్ 94.50 మార్కులు సాధించి ఎస్జీటీలో జిల్లా స్థాయిలో 2వ స్థానంలో నిలిచాడు. రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించాడు. గత ఏడాది తెలంగాణాలో నిర్వహించిన డీఎస్సీలో ఓపెన్ కెటగిరిలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి హైదరాబాద్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. గణేష్ తండ్రి చిన్న వయస్సులోనే మృతిచెందాడు. తల్లి సత్యవతి కూలి పనులు చేసుకుంటూ గణేష్‌ను చదివించింది. జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలవడంతో తల్లి ఆనందానికి అవధులు లేవు.

ఒకేసారి రెండు విభాగాల్లో...


మరడాన శ్రావణి

బొబ్బిలి రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కునుకువానివలస గ్రామానికి చెందిన మరడాన శ్రావణి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌లో 86 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచింది. టీజీటీ ఇంగ్లీష్ 78 మార్కులతో 15వ ర్యాంకు సాధించి రెండు పోస్టులకు ఎంపికైంది.

తవిటినాయుడుకు ఐదో ర్యాంక్


తవిటినాయుడు

తెర్లాం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విజయరాపురం గ్రామానికి చెందిన బూరి తవిటినాయుడు మూడు సబ్జెక్టులకు అర్హత సాధించాడు. సోషల్‌లో జిల్లాలో 5వ ర్యాంక్, పీజీటీ సివిక్స్‌లో 3వ ర్యాంక్, సోషల్‌లో 8వ ర్యాంక్ సాధించాడు.

రెండు విభాగాల్లో..


మజ్జి అన్నాజీరావు

సంతకవిటి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వాసుదేవపట్నం గ్రామానికి చెందిన మజ్జి అన్నాజీరావు స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో 18వ ర్యాంక్, టీజీటీలో 75 మార్కులతో 22వ ర్యాంక్ సాధించాడు.

సౌందర్యకు రెండో ర్యాంక్


సౌందర్య


శివప్రసాద్

గరుగుబిల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పిట్టలమెట్టకు చెందిన శిరికి సౌందర్య సోషల్‌లో 85.36 మార్కులతో జిల్లాలో 2వ ర్యాంకు టీజీటీ సోషల్‌కు 84.17 మార్కులతో రాష్ట్రంలో 2వ ర్యాంకు సాధించారు. వై.శివ ప్రసాద్ ఎస్జీటీలో 92 మార్కులుసాధించారు.

మూడు ఉద్యోగాలకు అర్హత


కిల్లంపల్లి శ్రీకాంత్

లక్కవరపుకోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కొట్యాడ గ్రామానికి చెందిన కిల్లంపల్లి శ్రీకాంత్ మూడు ఉద్యోగాలకు అర్హత సాధించారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 87.32 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానం, పీజీటీ సోషల్ విభాగంలో 75.5 మార్కులతో జోనల్ స్థాయిలో 3వ ర్యాంకు, టీజీటీ సోషల్ విభాగంలో 78.29 మార్కులతో జోనల్ స్థాయిలో 16వ ర్యాంకు సాధించాడు. ఇతని తండ్రి కార్పెంటర్, తల్లి గృహిణి.

మొదటి ర్యాంకు..


దూబ హరికృష్ణ


కిమిడి కృష్ణ

రేగిడి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంబఖండి గ్రామానికి చెందిన దూబ హరికృష్ణ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎస్ఏపీఈ)లో 90.5 మార్కులతో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో మొదటి ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించారు. ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు 84.5 మార్కులతో జోనల్‌లో 3వ ర్యాంక్, పీఈటీకి 86 మార్కులతో జోన్‌లో 9వ ర్యాంక్ సాధించారు. ఉణుకూరు గ్రామం నుంచి ఐదుగురు, అంబఖండి నుంచి ముగ్గురు ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు. దేవుదళకు చెందిన కిమిడి కృష్ణ స్కూల్‌అసిస్టెంట్, పీజీటీ, టీజీటీ మూడు పోస్టులకు అర్హత సాధించారు.

శేషపుపేటలో నలుగురికి అవకాశం


చందక సరస్వతి


సత్యనారాయణ


సంగారెడ్డి సత్యం


చందక లక్ష్మణ

గుర్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో శేషపుపేటకు చెందిన నలుగురు విద్యార్థులు సత్తా చాటారు. చందక సరస్వతి ఎస్జీటీలో 87.15 మార్కులతో 70వ ర్యాంకు, కంది సత్యనారాయణ ఎస్జీటీలో 88.26 మార్కులతో 47వ ర్యాంకు సాధించారు. సంగారెడ్డి సత్యం స్కూల్ అసిస్టెంట్ బయాలజీలో 81.44 మార్కులతో 7వ ర్యాంకు, చందక లక్ష్మణరావు పీఈటీగా 82 మార్కులతో 17వ ర్యాంకు సాధించారు

మూడు ఉద్యోగాలు...

జియ్యమ్మవలస, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చినమేరంగి గ్రామానికి చెందిన తుమరాడ దుర్గాప్రసాదరావు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ)లో రాష్ట్రంలో రెండో ర్యాంకు, టీజీటీలో జోన్‌లో 14వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)లో జిల్లాలో మొదటి స్థానం సాధించాడు.


తల్లిదండ్రులతో దుర్గాప్రసాదరావు

ఆస్పత్రికి మంచిరోజులు వచ్చేనా?

● శిథిలమైన భవనంలో సేవలు
● అర్ధాంతరంగా నిలిచిపోయిన నూతన భవనం
● ఇదీ శంబర పీహెచ్‌సీ పరిస్థితి



శిథిలావస్థకు చేరుకున్న పీహెచ్‌సీ

మక్కువ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి సంబంధించిన బిల్లులు కాకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో పనులు అర్ధాంతరంగా నిలిచిపో యాయి. దశాబ్దాల కిందట నిర్మించిన ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం అన్ని గదుల్లోనూ పెచ్చులూడి, నేల బీటలు వారి కుంగిపోతోంది. దీంతో సిబ్బంది భయాందోళన మధ్య విధులు నిర్వహిస్తున్నారు.

గిరిజనులకు ఆధారం..

మండలంలోని గిరిజన గ్రామాలకు శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచే సేవలు అందుతున్నాయి. వందలాది మంది రోగులతో నిత్యం కిటకిటలాడుతోంది. భవనం పూర్తిగా దెబ్బతినడంతో వైద్యానికి వస్తున్న వారంతా భయాందోళన చెందుతున్నారు. 24 గంటల ఆసుపత్రి కావడంతో విధులను నిర్వహించేందుకు సిబ్బంది అవస్థలు పడుతున్నారు. మందులు నిల్వ, రక్తపరీక్షలు నిర్వహించే, డేటా భద్రపరిచే గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీ భవనానికి ఆనుకుని నూతన భవన నిర్మాణ పనులను కాంట్రాక్టరు చేపట్టారు. అయితే అప్పట్లో బిల్లులు కాకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. భవనం దుస్థితిని చూసిన గిరిజనులు ఇక్కడికి వైద్యసేవల కోసం రావడానికి భయపడుతున్నారు. దీంతో మక్కువ పీహెచ్‌సీ, పార్వతీపురం ఏరియా ఆసుపత్రులకు చికిత్స కోసం వెళ్తు న్నారు. ఆసుపత్రి పరిసరాలు కూడా పిచ్చి మొక్కలు, వ్యర్థాలు పేరుకుపో యి విష సర్పాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


మధ్యలో నిలిచిపోయిన నూతన భవనం

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

● కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ అంబేడ్కర్ తదితరులు

డెంకాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. పినతాడివాడలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర సాధనకు కలిసికట్టుగా కృషి చేస్తామని గ్రామస్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో నిర్వహించిన అవగాహనా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయం వద్ద నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రత, స్వచ్ఛత స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యమని తెలిపారు. ప్రతి నెలా ఒక్కో అంశంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన నివారణ చర్యలపై ఈ నెలలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నీటి ద్వారా, కీటకాల ద్వారా వచ్చే వ్యాధులు వేర్వేరుగా ఉంటాయని, వాటిని నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వ్యక్తిగత, ఇంటి పరిశుభ్రతతోపాటు సామాజిక పరిశుభ్రత చాలా అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేసి స్వచ్ఛ గ్రామాలను రూపొందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిడర్లను సన్మానించారు. ఫాగింగ్ మిషన్లు వినియోగించడంపై పంచాయతీల్లో శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ, డీపీవో మల్లికార్జునరావు, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి, ఎంపీపీ బి.వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, ఎంపీడీవో వై.భవాని, తహసీల్దార్ రాజారావు, డిప్యూటీ ఎంపీడీవో డి.శ్రీనివాస రావు, మెడికల్ ఆఫీసర్ ఎం.శివరామకృష్ణ, ఎంపీటీసీ అచ్చెన్నాయుడు, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఏవో టి.సంగీత, కార్యదర్శి టి.వెంకటరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లోకి ఇతరులకు అనుమతి లేదు

● విద్యార్థులతో మాట్లాడకూడదు ● ఫొటోలు, వీడియోలు తీయడానికి వీలులేదు ● పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు

కొత్తవలస, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇకపై ఎవరికి వారు ప్రభుత్వ పాఠశాలల్లోకి వెళ్లడానికి కుదరదు. అనధికారిక వ్యక్తులను అనుమతించవద్దంటూ పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. విద్యార్థుల తల్లితండ్రులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు కాకుండా ఇతరులెవరూ ముందస్తు అనుమతి లేకుండా పాఠశాల ఆవరణలోకి వెళ్లడానికి వీలులేదు. అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిరోధించేందుకు... విద్యా కార్యకలాపాలలో అంతరాయం లేకుండా చూడడానికే ఈ మార్గదర్శకాలను విడుదల చేసినట్లు తెలిపింది. గత కొద్ది రోజులుగా ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు, సంస్థలు దానాలు, బహుమతుల పేరుతో పాఠశాలలోకి ప్రవేశిస్తున్నట్లు గుర్తించారు. దీని వల్ల విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందని ఉత్తర్వులలో పేర్కొన్నారు. తల్లిదండ్రులు మరియు, పాఠశాల నిర్వహణా కమిటీ సభ్యులు తప్ప మిగిలిన వ్యక్తులకు ఇకపై ప్రవేశం ఉండదు. దాతలు ఇచ్చే వస్తువులను ముందుగా యాజమాన్యం తనిఖీ చేసిన తరువాత ప్రధానోపాధ్యాయుడికి మాత్రమే అంద చేయాలి. ప్రధానోపాధ్యాయుడి ద్వారానే విద్యార్థులకు అందజేయవలసి ఉంటుంది. తరగతి గదులలోకి నేరుగా వెళ్లడం... విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడడాన్ని నిషేధించారు. అలాగే తరగతిలో గానీ... విద్యార్థులకు గానీ ఫొటోలు, వీడియోలు తీయడాన్ని నిషేధించారు. ఇకపై ఎవరిపైనైనా ఫిర్యాదు చేయాలంటే పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలోనే ఫిర్యాదు ఇవ్వాలసి ఉంటుంది తప్ప ఉపాధ్యాయులకు ఇవ్వడానికి వీలు లేదు. ఎటువంటి సంబంధం లేని వ్యక్తులతో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ప్రత్యక్షంగా మాట్లాడడానికి వీలు లేదు. ప్రాంగణంలో ఏదైనా రాజకీయ పార్టీకి సంబంధించిన గుర్తులు, పతాకాలు, స్టాల్స్, పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శించడానికి వీలు లేదు. ప్రభుత్వ ఉత్తర్వులకు సంబంధించిన నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే వెంటనే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి, లేదా ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయానికి తెలియజేయాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని ప్రభుత్వ ఆదేశాలలో తెలిపారు.

అంతరిక్షంలోనూ భారత్ ముద్ర

సాలూరు రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష రంగంలో భారత్ సైతం ప్రముఖ పాత్ర పోషిస్తోందని మామిడిపల్లి జిల్లా పరిషత ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కోట అయ్యప్ప అన్నారు. ఆయన ఆధ్వర్యంలో పాఠశాలలో బుధవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ అంతరిక్ష విజయాలను వివరించారు. పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, ఎస్ఎల్‌వీ రాకెట్లు, శాటిలైట్ల ప్రత్యేకతను వివరించారు. చంద్రయాన్-3 గురించి విద్యార్థినులు గంగవంశం చరిష్మ, నీలిరోతు రాజ్యలక్ష్మి వివరించడం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్స్, శాటిలైట్లు, చంద్రయాన్ నమూనాలతో పిరమిడ్‌ను ప్రదర్శించారు.



చంద్రయాన్, శాటిలైట్ల గురించి వివరిస్తున్న విద్యార్థినులు

సమన్వయంతో సేవలు అందించాలి

● సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి ● నేర సమీక్షలో డీఐజీ గోపీనాథ్ జెట్టి
● పోలీసు శాఖకు 34 డ్రోన్లు అందిస్తాం: కలెక్టర్ ● వసతి గృహాల్లో భద్రతను పర్యవేక్షించాలి: జిల్లా న్యాయాధికారి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

విజయనగరం క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులతో అర్ధ సంవత్సర నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఐజీతో పాటు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.బబిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ.. ఇటీవల నమోదవుతున్న గంజాయి, మత్తుపదార్థాల కేసుల్లో విద్యార్థులు అరెస్టు అవుతుండడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇటువంటి వారిని ప్రాథమిక స్థాయిలో గుర్తించి డి-ఆడిక్షన్ కేంద్రానికి పంపి అవసరమైన వైద్యం అందించాలన్నారు. 'సాంకేతిక నైపుణ్యాన్ని పోలీసు అధికారులు మెరుగుపరుచుకోవాలి. శివారు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించాలి. అనధికారికంగా ఎవరైనా ఆయుధాలు కలిగి ఉండడం చట్టరీత్యా నేరం.'అని అన్నారు. కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ.. జిల్లాలో పోలీసుశాఖ చక్కగా పనిచేస్తుందని తెలిపారు. గత ఏడాది పైడిమాంబ ఉత్సవంలో ఎటువంటి అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమన్వయంతో పనిచేశారన్నారు. ఈ ఏడాది అదే ఒరవడితో ముందుకు వెళ్లాలని అన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. త్వరలో జిల్లా పోలీసు శాఖకు 34 డ్రోన్లు అందిస్తామని తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత మాట్లాడుతూ.. మహిళలు బస చేసే వసతి గృహాల్లో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. న్యాయస్థానాల్లో ప్రాసిక్యూషన్ వేగవంతంగా పూర్తయ్యే విధంగా చూసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లని నియమించాలని కలెక్టర్‌ను కోరారు. సెప్టెంబరు 13న నిర్వహించనున్న లోక్‌అదాలత్ కార్యాక్రమం విజయవంతమయ్యే విధంగా చూడాలని పోలీసు అధికారులను కోరారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ కఠినంగా వ్యవహరిస్తుందని అన్నారు. మహిళల భద్రత, రహదారి భద్రత, శక్తియాప్, సైబర్ నేరాలు పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గంజాయి కేసుల్లో సమర్థవంతంగా విచారణ పూర్తి చేసిన ఎస్.కోట సీఐ నారాయణమూర్తి, బొబ్బిలిరూరల్ సీఐ నారాయణరావును అభినందించి, ప్రశంశాపత్రాలు అందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, రవాణాశాఖ ఉప కమిషనర్ మణికుమార్, జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు, డీఎఫ్‌వో కొండలరావు, డీఎంహెచ్‌వో జీవనరాణి, డీఈవో కేవీ రమణ, నగరపాలకసంస్థ అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు, డీఎస్పీలు శ్రీనివాసరావు, భవ్యారెడ్డి, రాఘవులు, గోవిందరావు, వీరకుమార్, న్యాయ సలహాదారులు పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

● నేరాల నియంత్రణలో సాంకేతికతను వినియోగించుకోవాలని డీఐజీ గోపీనాథ్ జెట్టి పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ ప్రాంగణం, కమాండ్ కంట్రోల్ రూం పనితీరును పరిశీలించి సీఐకు పలు సూచనలు చేశారు. మహిళలు, చిన్నారులపై ఎటువంటి అఘాయిత్యాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ లీలారావు, టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


హాజరైన వివిధ శాఖల అధికారులు

హైవే అన్నారు.. ఇలా వదిలేస్తున్నారు

- మరమ్మతులకు నోచుకోని ఎస్.కోట- అరకు రహదారి
- అధికారుల పర్యవేక్షణ కరువు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎస్.కోట నుంచి అరకు వెళ్లే ప్రధాన రహదారి గతంలో రహదారుల శాఖ పరిధిలో ఉండగా, కొద్ది నెలల కిందట జాతీయ రహదారుల శాఖకు అప్పగించారు. అయితే దీనిని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల వర్షాలకు ఈ రహదారి దెబ్బతినడంతో స్థానిక యువకులు ముందు కొచ్చి, మరమ్మతులు చేసుకున్నారు. ఎస్.కోట నుంచి బొడ్డవర వరకు రోడ్డుకు ఇరువైపుల తుప్పలు తొలగించాల్సి ఉండగా.. మండలంలోని రాజీపేట గ్రామం వరకు తూతూమంత్రంగా వాటిని కొద్దిమేర తీయించి వదిలేశారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు జాడ ఇక్కడ కానరావడం లేదు. అలాగే ఈ రోడ్డును పర్యవేక్షించి, మరమ్మతులు చేయించాల్సిన కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు చేసుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.


రహదారిపై గోతులను పూడ్చుతున్న యువకులు(ఫైల్)

జంగిల్ క్లియరెన్స్ ప్రారంభించాం

ఈ విషయాలపై జాతీయ రహదారుల శాఖ డీఈ సత్యభాస్కర్‌ను వివరణ కోరగా.. కొద్దిరోజుల కిందట జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించామని, ఇక రోడ్డు మరమ్మతులు మెయింటినెన్స్ కాంట్రాక్టర్ చేస్తారని తెలిపారు. త్వరలోనే తమ జేఈల ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.


బొడ్డవర-ఎస్.కోట రహదారికి ఇరువైపులా పెరిగిన తుప్పలు

స్వర్ణాంధ్రలో భాగస్వాములు కావాలి

- రాజాం ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. శనివారం పొగిరి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల నుంచి పొగిరి అంబేడ్కర్ విగ్రహం వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, పొగిరి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచిరెడ్డి నరసమ్మ అనే మహిళకు మంజూరైన రూ.28,219 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుమల మన్మథరావు, పార్టీ నాయకులు కోండ్రు జగదీష్, గురవాన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కోండ్రు

గ్రామాల పరిశుభ్రతకు కృషి

- ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. గనివాడ గ్రామంలో శనివారం ఆమె స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. చీపురుపట్టి వీధులు ఊడ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని మురికి కాలువల్లో, రోడ్లపైనే చెత్త లేకుండా చూడాలని సూచించారు. వాటర్ ట్యాంకులు శుభ్రంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, జీఎస్.నాయుడు, మల్లా రామకృష్ణ, కొట్యాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.


గనివాడలో చెత్త ఊడుస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి

చీపురుపల్లిలో రక్తదాన శిబిరం

చీపురుపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి బ్రహ్మకుమారి కేంద్రంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 113 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి, రాజయోగిని అన్నపూర్ణలు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ విశ్వ బంధుత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించాలన్న లక్ష్యంతో శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. చీపురుపల్లి సేవా కేంద్రం ఇన్‌చార్జి శాంతి అక్కయ్య, మానవీయత సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు పాల్గొన్నారు.

గరివిడిలో..

గరివిడి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గరివిడిలోని ఓంశాంతి భవనంలో బ్రహ్మకుమారి లతక్క అధ్యక్షతన శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు వందమంది దాతలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసితులను పట్టించుకోరా?

ఎస్.కోట రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మండలంలోని జిందాల్ భూముల వివాదం నడుస్తోందని, ఈ తరుణంలో మండలంలోని ధర్మవరంలో ఒక ఆశ్రమానికి రోడ్డు నిర్మాణం కోసం వచ్చిన కలెక్టర్.. నిర్వాసితులను పట్టించుకోలేదని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శనివారం ఆయన బొడ్డవర గ్రామంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు శంకుస్థాపనకు వచ్చిన కలెక్టర్‌కు ఇక్కడ నిరసన చేస్తున్న నిర్వాసితులను పట్టించుకోకపోవడం వారి దౌర్భాగ్యం అన్నారు.


మాట్లాడుతున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రఘురాజు

శిథిలావస్థలో సామాజిక భవనం


నిరుపయోగంగా మారిన సామాజిక భవనం

భోగాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): భోగాపురం గ్రామంలోని పెద హరిజన వీధిలో గల సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ కొన్ని సంవత్సరాల కిందట సామాజిక భవనం నిర్మించారు. ఈ భవనం స్థానికులకు ఎంతగానో ఉపయోగపడింది. అయితే గత కొంత కాలం నుంచి ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులు ఊడిపోవడంతో పాటు గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో ఈ భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. ఈ శిథిల భవనాన్ని తొలగించి, నూతన సామాజిక భవనాన్ని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిఒక్కరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. శనివారం స్థానిక మండ ల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఉద్యమ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రతిఒక్కరూ వారి ఆలోచన ప్రకారం చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. రిజిస్ట్రేషన్, రాయితీ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్ కరుణాకర్, కోఆర్డినేటర్ శశికళ నియోజకవర్గ ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, మిరాకిల్ సీఈవో ప్రసాదు లోకం, డీపీఎం రాజ్‌కుమార్, ఏపీఎం జగదీష్, నాయకులు పల్లంట్ల జగదీష్, బొల్లు త్రినాథ్, గుండపు సూరిబాబు, ఆళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

సీఐని సస్పెండ్ చేయాలి

- జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తమ నిరసనకు అనుమతి ఇవ్వని సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని జిందాల్ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బొడ్డవర గ్రామంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షుడు చల్లా జగన్, నిర్వాసితులు మాట్లాడారు. ఇక్కడ కాఫీ, టీ ఎస్టేట్స్ ఉన్నాయని, ఇది చాలా రద్దీగా ఉన్న రోడ్డు కావడంతో నిరసనలకు అనుమతి ఇవ్వలేకపోతున్నామని సీఐ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ● ఈ విషయంపై సీఐ నారాయణమూర్తి వివరణ కోరగా.. తాను ఈ ప్రాంతంలో ఎస్టేట్‌లు ఉన్నాయని చెప్పలేదని, ఇది జాతీయ రహదారి, తోటలు ఉండే ప్రాంతంగా పేర్కొన్నానని తెలిపారు. వందమంది వంటావార్పుకు చేసేందుకు అడిగితే ఇవ్వడం కుదరదని నివేదికలో పేర్కొన్నానని ఆయన తెలిపారు.


సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్న నిర్వాసితులు

స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చేశాయ్

రాజాం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులు రాజాం మండలానికి చేరుకున్నాయని సీఎస్‌డీటీ చిరంజీవి తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి 23,731 స్మార్ట్ రేషన్ కార్డులను మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ రేషన్ కార్డులను ఈనెల 25వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా వినియోగదారులకు పంపిణీ చేస్తామని చెప్పారు. అలాగే వచ్చేనెల 1వ తేదీ నుంచి చౌకధరల దుకాణాల్లో రేషన్ డీలర్ల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తామన్నారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డులను సచివాలయ సిబ్బంది డీలరు వద్ద బయోమెట్రిక్ వేసి తీసుకోవాలని తెలిపారు.

భోగాపురంలో పంపిణీ

భోగాపురం, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ రమణమ్మ చౌకధరల డిపోల డీలర్లకు రేషన్ స్మార్టు కార్డులు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 18,370 కుటుంబాలకు చెందిన స్మార్టు కార్డులు వచ్చాయని చెప్పారు. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు సచివాలయాల్లో అందజేస్తామన్నారు. మిగిలిన కార్డులు వచ్చేనెల 1వ తేదీ నుంచి 15వ తేదీలోగా డీలర్లకు అందజేస్తామని తెలిపారు. పౌర సరఫరాల అధికారి బీవీ మురళి, రీసర్వే డీటీ రవి, డీలర్లు పాల్గొన్నారు.


భోగాపురం: డీలర్లకు స్మార్టు కార్డులు అందజేస్తున్న తహసీల్దార్ రమణమ్మ

సర్కార్ భూముల్లో పాగా


గుండాలపేటలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన రేకుల షెడ్డు

డెంకాడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదతాడివాడ రెవెన్యూ గుండాలపేట సమీపంలోని పలు సర్వే నెంబర్లలో గల సుమారు ఏడు ఎకరాల ప్రభుత్వ భూమి, పోరంబోకు వాగులు, గెడ్డలను కొందరు ఆక్రమించి, ఆ స్థలంలో రేకుల షెడ్లు నిర్మించారు. దీనిపై పెదతాడివాడ గ్రామానికి చెందిన జనసేన నాయకుడు తుమ్మి అప్పలరాజుదొర గతంలో కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అయినా ఎటువంటి చర్యలు లేవని తెలిపారు. ఈ అక్రమాలపై రెవెన్యూ సిబ్బంది స్పందించి, సర్వే చేపట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ సర్వే నెంబర్లలో గల భూములకు పాట నిర్వహించాలన్నారు.

పేరుకే నో పార్కింగ్ జోన్..

- రోడ్డుపై వాహనాలు నిలిపేస్తున్న వైనం

విజయనగరం టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతి నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బాలాజీ జంక్షన్‌కు వెళ్లే రోడ్డులో ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన నో పార్కింగ్ జోన్ ప్రకటనకే పరిమితమవుతోంది. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు బస్సులు ఇక్కడ నుంచే బయలుదేరుతాయి. ఇక్కడ గంటల తరబడి బస్సులను, ఇతర వాహనాలను నిలిపేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఎల్ఐసీ కార్యాలయంలోకి వెళ్లే ప్రధాన గేటు వద్ద గంటల తరబడి బస్సులను నిలిపివేస్తున్నారు. దీంతో కార్యాలయంలోకి వెళ్లేందుకు ఉద్యోగులు, పాలసీదారులు ఇబ్బందులు పడుతున్నారు.


నోపార్కింగ్ జోన్‌లో ప్రైవేటు బస్సులు

టీడీపీ మండల అధ్యక్షుడిగా మహంతి

పూసపాటిరేగ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ పూసపాటిరేగ మండల అధ్యక్షుడిగా మహంతి శంకర్రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక శనివారం పూసపాటిరేగలో నిర్వహించారు. శంకర్రావును టీడీపీ మండల కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నంనాయుడు, ఆకిరి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను పూజిద్దాం

శృంగవరపుకోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ వినాయక చవితి పండుగ రోజున మట్టి విగ్రహాలను పూజించాలని గ్రీన్‌ఎర్త్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. శనివారం ఎస్.కోట మండల కేంద్రంలోని, మండలంలోని భవానీనగర్, భర్తపురం గ్రామాల్లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

వినాయక ప్రతిమల పంపిణీ

విజయనగరం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తమన్నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విజయనగరం మండలం గుండాలపేట గ్రామంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలను తమన్నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొడ్డేపల్లి రామకృష్ణారావు విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం కరక ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా పావని

గజపతినగరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా రెడ్డి పావని రెండో పర్యాయం ఎన్నికయ్యారు. ఈసందర్భంగా శనివారం గజపతినగరంలోని పార్టీ కార్యాలయంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఆమె పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏడుకొండలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కరరావు, నాయకులు దొగ్గ దేముడు, తౌడు పాల్గొన్నారు.

సీపీఐ నేత సుధాకర్‌రెడ్డికి నివాళి

నెల్లిమర్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి, నలగొండ మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి మరణం పట్ల ఆ పార్టీ నెల్లిమర్ల మండల సమితి దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. సీపీఐ నెల్లిమర్ల మండల కార్యదర్శి మొయిద పాపారావు ఆధ్వర్యంలో కొండగుంప గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.శ్రీవరం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నత విద్యాశాఖ డిగ్రీ ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. కళాశాలలో బీఏ రెండు సెక్షన్లతో పాటు పొలిటికల్ సైన్స్ మేజర్ ఎకనామిక్స్ మైనర్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బోటనీ మేజర్ కెమిస్ట్రీ మైనర్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ మేథ్స్ వంటి సబ్జెక్టులు ఉన్నాయని పేర్కొన్నారు.

యోగా పోటీల్లో సత్తాచాటిన తలవరం విద్యార్థిని

వీరఘట్టం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తలవరం జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని వావిలపల్లి సంజనకు యోగా పోటీల్లో సత్తాచాటి రాష్ట్ర స్థాయి తృతీయ స్థానం సాధించింది. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం దగ్గర పత్తిపాడులో జరిగిన రాష్ట్ర స్థాయి యోగాసనాలు పోటీల్లో పార్వతీపురం మన్య జిల్లా తరపున పాల్గొన్న సంజన ప్రతిభ చూపింది. ఈ మేరకు సంజనకు పాఠశాల హెచ్ఎం రాజ్యలక్ష్మి, యోగా గురువు జనార్దనరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రూ.400కే బీఎస్ఎన్ఎల్ ట్రిపుల్ ప్లే ఆఫర్

విజయనగరం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) తాజాగా రూ.400కే ట్రిపుల్ ప్లే ఆఫర్‌ని ప్రవేశపెట్టిందని ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజరు డి.దాలినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు రూ.400 చెల్లించడం ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్‌తో పాటు 400పైగా టీవీ చానల్స్, 9 ఓటీటీ చానల్స్, అపరిమిత ఫోన్ కాల్స్‌ని వినియోగదారులు వినియోగించుకోవచ్చునని తెలిపారు. ఈ కనెక్షన్ కావల్సిన వారు సమీప ప్రాంతాల్లో ఉన్న బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాన్ని గానీ బీఎస్ఎన్ఎల్ టెలికాం ఇన్‌ఫ్రా పార్ట్‌నర్స్‌ని గానీ సంప్రదించాలని కోరారు.

పాఠశాల మైదానం బాగుచేశారు

వేపాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబలయ్యపాలెం ప్రభుత్వ పాఠశాల మైదానం లోతట్టుగా ఉండడంతో వర్షపు నీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్థులంతా స్పందించి, తమ సొంత నిధులతో మట్టిని తెప్పించి, మైదానాన్ని చదును చేయించారు. అలాగే పాడై ఉన్న ప్రహరీని, గేటును బాగు చేయించారు.


మైదానాన్ని చదును చేస్తున్న గ్రామస్థులు

వంశధార నదిలో మహిళ గల్లంతు


లక్ష్మి(ఫైల్)

భామిని, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లివిరి గ్రామంలో వంశధార నదిలో స్నానానికి వెళ్లిన కుమ్మర లక్ష్మి అనే మహిళ గల్లంతయ్యింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. లివిరి గ్రామానికి చెందిన లక్ష్మి శనివారం వంశధార నదిలో నీలరేవు వద్దకు స్నానానికి వెళ్లింది. మెట్లు పూర్తిస్థాయిగా లేకపోవడంతో ఆమె నదిలోకి జారిపడిపోయింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ ఎన్.శివన్‌నారాయణ, బత్తిలి ఎస్ఐ జి.అప్పారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. కొత్తూరు అగ్నిమాపక ఎస్ఐ ఎన్.బుచ్చోడు ఆధ్వర్యంలో సిబ్బంది, యువత నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. లివిరి నుంచి ఒడిశా కాశీనగరం వరకు సుమారు 8 కిలోమీటర్లు గాలించినా దొరకలేదు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుర్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుజ్జింగివలస గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గూడెం గ్రామం నుంచి అచ్యుతాపురం వెళ్తున్న రెడ్డి లక్ష్మణరావు, అప్పన్నలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు బైకుపై వెళ్తుండగా ఎదురుగా చీపురుపల్లి నుంచి వస్తున్న వ్యాను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. వీరిని 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీయత్నం

కొత్తవలస, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మికాపల్లి గేట్ సమీపంలోనున్న షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం చోరీకి యత్నం జరిగింది. ఆలయానికి చెందిన సీసీ కెమెరాల కనెక్షన్లను తొలగించారని, తాళాలు పగులగొట్టారని ఆలయ నిర్వాహకుడు అంపోలు ఉమామహేశ్వరశర్మ తెలిపారు. హుండీలోని డబ్బులు గానీ, మరే వస్తువులు చోరీకి గురి కాలేదన్నారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చామని చెప్పారు.

యూరియా కృత్రిమ కొరతను సృష్టించవద్దు


యూరియా పంపిణీ విధానాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజారావు

డెంకాడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): యూరియాను అధిక ధరకు విక్రయించినా, కృత్రిమ కొరతను సృష్టించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాజారావు హెచ్చరించారు. చొలంగిపేట రైతు భరోసా కేంద్రాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. యూరియాను రైతులకు పంపిణీ చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారి సంగీత మాట్లాడుతూ ప్రతి రైతుకూ ఒక బస్తా చొప్పున యూరియా ఇవ్వాలన్నారు. ఆధార్ కార్డు, వన్‌బీని తీసుకుని యూరియాను సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రామకోటి, వీఏఏ శాలిని, రైతులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జిల్లా మహిళా జట్టు ఎంపిక


సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

భోగాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సాఫ్ట్‌బాల్ జిల్లా మహిళా జట్టును ఎంపిక చేశామని హెచ్ఎం వి.అప్పన్న తెలిపారు. ఈ జట్టు 12వ సాఫ్ట్‌బాల్ అంతర జిల్లా పోటీల్లో పాల్గొనుందని చెప్పారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ఈ సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు ఈనెల 30, 31 తేదీల్లో గుంటూరులో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ ఎంపిక కార్యక్రమంలో పీడీ అరుణకుమారి, పీఈటీ పీడీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.వెంకటనాయుడు, బంగారునాయుడు, అప్పలనాయుడు, శ్రీనివాసరావు, స్థానిక హైస్కూల్ పీడీ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు



మాట్లాడుతున్న న్యాయాధికారిణి కనకలక్ష్మి

శృంగవరపుకోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎస్.కోట జూనియర్ సివిల్ న్యాయాధికారిణి, మండల న్యాయసేవా కమిటీ చైర్‌పర్సన్ బి.కనకలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యతో ప్రగతి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొలువుల పంట

(3వ పేజీ తరువాయి)

బయాలజీ 1359 మందితో మెరిట్ జాబితాలను ప్రకటించారు. ఇవి కాకుండా జోన్‌ల వారీగా పీజీటీ, టీజీటీ ప్రిన్సిపాళ్లు తదితర పోస్టుల మెరిట్‌లిస్ట్‌లను ప్రకటించారు.

ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్నవారు..

ఎస్జీటీ కేటగిరీలో సుంకరి మోహనరావు 94.64 మార్కులు సాధించి ప్రథమంగా నిలిచారు. పాఠశాల సహాయకుల కేటగిరీలో ఆంగ్లంలో మజ్జి భార్గవి 83.64 , గణితంలో మరడాన రామనాయుడు 89.73, ఫిజికల్ సైన్స్‌లో బండారు కల్యాణి 82.64 , సోషల్‌లో కిల్లంపల్లి శ్రీకాంత్ 87.32 , తెలుగులో తుమరాడ దుర్గాప్రసాద్ 89.62 , బయాలజీలో బోర శ్రీనివాసరావు 85.48 మార్కులతో ప్రథమంగా నిలిచారు. బలిజిపేట మండలం పెదపెంకికి చెందిన సారిపల్లి నాగరాజు తెలుగు పీజీటీ, టీజీటీ, పాఠశాల సహాయకుల పోస్టులకు సంబంధించి ఉత్తమ మార్కులు సాధించి మెరిట్ జాబితాలో ఉన్నారు.

టీడీపీ జిల్లా రథసారథి ఎవరో?

(3వ పేజీ తరువాయి)

కమిటీకి నివేదించనుంది. ఈ మేరకు పార్టీ ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు నాగార్జున, ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజుతో పాటు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులకు రాష్ట్ర పార్టీ సమాచారం అందజేసింది.

ఎవరికి అవకాశం దక్కుతుందో?

టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ప్రస్తుతం కిమిడి నాగార్జున ఉన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటూ, జిల్లాలో పార్టీని విజయతీరాలకు చేర్చడంలో ఆయన పాత్ర ప్రశంసనీయం. అయితే, జిల్లా అధ్యక్షుడిగా మళ్లీ ఆయనకే అధిష్ఠానం అవకాశం కల్పిస్తుందా? లేక కొత్తవారికి అవకాశం ఇస్తుందా? అన్నది వేచి చూడాలి. ఇక సుదీర్ఘకాలంగా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఐవీపీ రాజు, తిరిగి ప్రధాన కార్యదర్శిగా తననే కొనసాగించాలని కోరుతున్నారు. అయితే సుదీర్ఘకాలం పాటు ఆయన ఆ పదవిలో ఉండడంతో మరొకరికి అవకాశం కల్పించాలా? లేక అతన్నే కొనసాగించాలా?అన్నది విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు నిర్ణయంపై ఆధారపడి ఉంది. ఐవీపీ రాజు విజయనగరానికి చెందిన వారు కావడంతో ఎమ్మెల్యే అదితి నిర్ణయాన్ని అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోనుంది. ఈ నెల 26న త్రీమెన్ కమిటీ ఆశావహుల జాబితాను తీసుకుని అధిష్ఠానానికి నివేదించనుంది. సెప్టెంబరు 3న అధిష్ఠానం అధికారికంగా ప్రకటించనుంది. ఆ తరువాత వారం రోజుల్లోగా కొత్త కమిటీలు బాధ్యతలు చేపట్టనున్నాయి.

ఏమైందో ఏమో?

(3వ పేజీ తరువాయి)

శత్రువులు వారికి లేరని గ్రామస్థులు అంటున్నారు. శుక్రవారం రాత్రి భార్యభర్తలు వాట్సాప్‌లో చాటింగ్ చేసుకున్నట్టు గుర్తించామని సీఐ తెలిపారు. 'నేను నీకు అడ్డు రాను, సంతోషంగా ఉండు అంటూ' వెంకటలక్ష్మి తన భర్తకు మెసేజ్ చేయగా, అందుకు భర్త చిరంజీవి.. గుడ్ అని తిరిగి మెసేజ్ చేశాడు. దీనికి ఆమె ఓకే అని మెసేజ్ చేయగా.. భర్త బై అని ఆఖరిగా మెసేజ్ చేసినట్లు వారి ఫోన్లలోని చాటింగ్‌ను పోలీసులు వివరించారు. వారిద్దరూ ఇంట్లోనే ఉంటూ, ఒకరికొకరు నేరుగా మాట్లాడుకోకుండా ఫోన్లలో చాటింగ్ చేసుకున్నట్లు తెలిసింది. ఆ తరువాత ఇద్దరి మధ్య ఏమైనా పెనుగులాట వంటిది జరిగిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భార్య మెడలోని గొలుసులు తెగిపోయి, ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడం దీనికి బలం చేకూరుస్తుంది. అర్ధరాత్రి 12 గంటల తరువాత వెంకటలక్ష్మి ఉరేసుకుని ఆత్మ చేసుకొని ఉంటుందని, దీన్ని చిరంజీవి చూసి ఆమెను కిందకు దింపేసరికే మృతి చెంది ఉండొచ్చునని, దీంతో పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో ఆయన కూడా ఉరేసుకుని చనిపోయి ఉంటాడని సీఐ తెలిపారు. తమ విచారణలో ఇద్దరూ మంచి వారేనని తేలిందన్నారు. చిన్నచిన్న మనస్పర్థల కారణంగానే ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారని చెప్పారు. వెంకటలక్ష్మి తల్లిదండ్రులు చనిపోగా, తమ్ముడు గీతల రాజేష్ ఉన్నాడు. చిరంజీవికి తల్లి ఉంది. ఈమె చినదుంగాడలో ఉంటుంది. రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేశారు. తహసీల్దార్ పి.అప్పలరాజు సమక్షంలో శవపంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను శృంగరవపుకోట ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వస్తేగానీ మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియరావని సీఐ చెప్పారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోనమసివానిపాలెం 'ఉపాధి' ఎఫ్‌ఏపై విచారణ

(3వ పేజీ తరువాయి)

ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏపీడీ రమామణి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు విచారణ ప్రారంభించారు. 2012 నుంచి ఇప్పటి వరకూ సుమారు కోటి రూపాయల నిధుల వరకు అవకతవకలు జరిగాయని, 39 మంది కూలీలు పని చేయకుండానే, వారిపేరున మస్తర్లు వేసి ఎఫ్ఏ అప్పారావు సొమ్ము డ్రాచేశాడని ఫిర్యాదుదారుడు శ్రీనివాసరావు సాక్ష్యాధారాలను అధికారుల ముందుకు తీసుకొచ్చే సమయంలో ఎఫ్ఏ వర్గీయులు గొడవకు దిగారు.విచారణ అధికారులకు సహకరించకుండా గందరగోళం సృష్టించారు. వారిని గట్టిగా హెచ్చరిస్తూ కేకలు వేయడంతో అధికారులు భయపడిపోయారు. అక్కడ ఉన్న కానిస్టేబుల్ వారిని అదుపు చేయలేకపోవడంతో, అధికారుల ఎస్‌ఐకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి తగాదా పడుతున్నవారిని చెదరగొట్టారు. అనంతరం మళ్లీ విచారణ చేపట్టగా, ఎఫ్ఏ వర్గీయులు మరోసారి గొడవకు సిద్ధమవడంతో అధికారులు వెనుదిరిగారు. మరోమారు విచారణ చేపడతామని, ముందస్తుగా సమాచారం ఇచ్చి ఎక్కువ మంది పోలీసు రక్షణతో 144 సెక్షన్ పెట్టి విచారణ చేస్తామని ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డీబీటీ మేనేజర్ హసిఫ్ హుస్సేన్, సీఎల్‌ఆర్సీ ఏపీడీ చిన్నంనాయుడు, ఏపీవో విజయలక్ష్మి, వీరలక్ష్మి, టీఏలు పాల్గొన్నారు.

హౌసింగ్ బిల్లుల కోసం ఎదురుచూపు

(3వ పేజీ తరువాయి)

సంబంధించి 5,186 మంది లబ్ధిదారులకు రూ.15.32 కోట్లు చెల్లించాల్సి ఉందని జిల్లా అధికారులు నివేదికలు పంపారు. కానీ, ఏడాది అవుతున్నా వాటికి మోక్షం లేదు. ● 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక నాయకులు చాలాచోట్ల కలెక్షన్ల పర్వానికి దిగారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా నిర్మించిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయిస్తామని చాలా గ్రామాల్లో భారీగా వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. అయితే జగన్ సర్కారు నుంచి ఉలుకూ పలుకూ లేకపోవడంతో లబ్ధిదారులు నిలువునా మోసపోయారు. అటు బిల్లులు రాక.. ఇటు నేతలకు కొంత వరకూ సమర్పించు కొని రెండింటికీ చెడ్డ రేవడిగామారిపో యారు. జిల్లాలో రాజాంనియోజకవర్గంలోఅధికంగా రూ.4.2కోట్ల బిల్లులుపెండింగ్ ఉండగా, అత్యల్పంగా విజయనగరం నియోజక వర్గంలో రూ.68 లక్షలు చెల్లించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వంపైనే లబ్ధిదారులు ఆశలు పెట్టుకున్నారు.

బిల్లులు చెల్లించాలి..

ఇంటి బిల్లు కోసం ఆరేళ్లుగా ఎదురుచూస్తున్నా. గత టీడీపీ ప్రభుత్వం సగం బిల్లు చెల్లించింది. వైసీపీ ప్రభుత్వం దాని గురించి అసలు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా బిల్లులకు మోక్షం కలగలేదు. తక్షణం చెల్లింపులు చేయాలి.

-జి.ధనంజయ, ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారు, రాజాం

అప్పుచేసి ఇల్లు కట్టాం..

పేరుకే గృహనిర్మాణ లబ్ధిదారులం. అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాం. కానీ, బిల్లులు మాత్రం చెల్లించలేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో వినతిపత్రాలు అందించా మే తప్ప బిల్లులు మాత్రం మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు అధికారంలోకి వచ్చిన వెంటనే అధికారులు వివరాలు తెలుసుకోవడంతో బిల్లులు మంజూరుచేస్తారని ఆశించాం.కానీ ఇంతవరకూ చెల్లించలేదు.

- చింత సత్యనారాయణ, ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారు, రాజాం

ప్రభుత్వానికి నివేదించాం

కొద్ది నెలల కిందట జిల్లాలో సర్వే చేశాం. ప్రభుత్వానికి నివేదికలు కూడా పంపాం. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో 5,186 ఇళ్లకుగాను రూ.15.52 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం వద్ద కూడా సమగ్ర సమాచారం ఉంది. నిధులు విడుదల చేసిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది.

-శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ, విజయనగరం

ఇంటింటికీ వెళ్లి సర్వే చేయండి

● డీడీవో కిరణ్‌కుమార్



కోమటిపల్లిలో స్వామిత్వ సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న కిరణ్‌కుమార్

బొబ్బిలి రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తప్పులు లేకుండా ఇంటింటికి వెళ్లి స్వామిత్వ సర్వేను చేపట్టాలని డీడీవో ఎం.కిరణ్ కుమార్ తెలిపారు.శనివారం మండలంలోని కోమటిపల్లిలో సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాళీ స్థలాలను గుర్తించాలని కోరారు. భూసర్వే తరహాలో గ్రామాల్లో కంఠాలు, ఇతర స్థలాల్లో నిర్మాణాలు, పశువుల శాలలను డ్రోన్ల సాయంతో సర్వేచేసి గుర్తించి, వారికి హక్కుపత్రాలు మంజూరు చేయాలని కోరారు. ఆస్తుల విక్రయాలు, బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చని తెలిపారు. సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, ఏఈ రాజశేఖర్, ఎంసీవో సుధాకర్ పాల్గొన్నారు.

సకాలంలో నిర్మాణం పూర్తిచేయండి

మండలంలోని జగన్నాథపురంలో నిర్మిస్తున్న డీడీవో కార్యాలయాన్ని డీడీవో కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల గురించి ఇంజనీర్లను, అధికార్లను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పనులు పూర్తిచేయాలని సూచనలు చేశారు.

టంగుటూరికి నివాళి

టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం భావి తరాలకు ఆదర్శమని డీడీవో ఎం.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి జయంత్యుత్సవాలు పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి . రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడిన ప్రకాశం పంతులు జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, ఎంసీవో సుధాకర్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

● ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'



బొబ్బిలి: ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు పిలుపునిచ్చారు. శనివారం ప్రభుత్వకార్యాలయాలఆవరణలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

●బొబ్బిలి రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు పరిసరాల పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వామి అయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని డీడీవో ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. బొబ్బిలి మండలపరిషత్ కార్యాలయం ఎంపీడీవో పి.రవికుమార్ పర్యవేక్షణలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాన్‌సూన్ హైజిన్‌అనే థీమ్‌తో కార్యక్రమం నిర్వహించారు.అనంతరం అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, ఉపాధి ఏపీవో లక్ష్మీపతిరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●బొబ్బిలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ప్రాంగణంలో శనివారం పీవోజె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.అనంతరం కార్యాలయాన్ని పరిశుభ్రం చేశారు. స్వచ్ఛభారత్‌కోసం ప్రతిజ్ఞచేయించారు. కార్యక్రమంలో సెక్టారు సూపర్‌వైజర్లు ప్రభావతి, రాజు, శుభలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలి

● వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డిమాండ్



ధర్నా చేస్తున్న గిరిజనులు, రైతుసంఘం ప్రతినిధులు

బొబ్బిలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):మెంటాడ మండలంలోని దళితులు, గిరిజనులు సాగు చేస్తున్న పోడు, అటవీ భూములకు సాగు పట్టాలివ్వాలని జిల్లా వ్యవసాయ కార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీనివాస్, రాకోటి రాములు డిమాండ్ చేశారు. బొబ్బిలి ఆర్డీవో కార్యాలయం ముందు ఆదివాసీ గిరిజనసంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా గిరిజనులు రిజర్వుఫారెస్ట్ భూములను సాగు చేసుకుంటున్నా వారికి పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. భూమి హక్కు నిర్ధారణ అయిన తరువాత కూడా రిజిస్ట్రేషన్ రద్దు చేసి పేదలకు ఎందుకు పట్టాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆగూరు రెవెన్యూలో తక్షణమే నకిలీ పత్రాలను రద్దుచేసి సాగుచేసుకుంటున్న గిరిజన కుటుంబాలకు పట్టాలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, శ్రీను, పెదరాము, అప్పారావు,, సన్యాసమ్మ, గౌరమ్మ, వీరమ్మ, గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

పనస మొక్కల పెంపకంపై చర్యలు

రామభద్రపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిది గ్రామాల్లో చెరువు గట్లపై పనస మొక్కల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఏపీవో త్రినాథరావు తెలిపారు. శనివారం రామభద్రపురంలో విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి వీణల తయారీకోసం సామాజిక వనాల పెంపకంలో భాగంగా సీఆర్‌డీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. దీని కోసం రామభద్రపురం, ముచ్చర్లవలస, బూసాయవలస, తారాపురం, శిష్టు సీతారాంపురం, ఇట్లామామిడిపల్లి గ్రామాలను ఎంపికచేసి సుమారు 500 పనస మొక్కలు నాటడానికి సిద్ధం చేశామని చెప్పారు. వాచర్‌ను పెట్టి ఈ మొక్కల సంరక్షణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ ఏడాది మండలంలో 60 ఎకరాల్లో హార్టికల్చర్ అభివృద్ధి చేసున్నామని, ఇప్పటికే 56 ఎకరాల్లో గ్రౌండింగ్ చేశామని తెలిపారు. మామిడి, జీడిమామిడి 25 ఎకరాల్లో, కొబ్బరి, సపోటా తదితర మిగతా విస్తీర్ణంలో పెంపకం చేపట్టనున్నామని చెప్పారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన సాఫ్ట్‌బాల్ జట్టు సభ్యులు

బొబ్బిలి రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పారాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు గుంటూరులో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. శనివారం తూడెం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ మేరకు పారాది జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థినులు మౌనిక, తేజస్విని, చైతన్యకుమారి, అవంతిక, సుప్రియ, మన్విత. జయశ్రీ, దుర్గ, యమునలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకుస్థానం సంపాదించుకున్నారని పీడీ నల్ల వెంకటనాయుడు తెలిపారు.

పోషకాహారంపై గర్భిణులకు అవగాహన



పోషకాహారంపై గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్‌ఈవో రమణ

బొబ్బిలి రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు రక్తహీనత, పోషకాహార లేమితో బాధపడుతున్నారని పిరిడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎంపీహెచ్‌ఈవో బి.రమణ తెలిపారు. శనివారం మండలంలోని పారాది ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహార లభ్యత, పోషకాహారం వల్ల శరీరానికి కలిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ తవిటినాయుడు పాల్గొన్నారు.

బార్ల నిర్వహణకు లైసెన్స్‌లు

బొబ్బిలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):కొత్త మద్యం పాలసీ ప్రకారం రానున్న మూడు సంవత్సరాలకు బొబ్బిలిలో కొత్తగా నాలుగు మద్యం బార్లు మంజూరైనట్లు ఎక్సైజ్ సీఐ పామోటి చిన్నంనాయుడు తెలిపారు. బార్ల నిర్వహణకు లైసెన్స్‌కోసం ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26 సాయంత్రం ఐదు గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుము కింద రూ. ఐదులక్షలు (వాపసురాని రుసుము) చెల్లించాలని కోరారు. దరఖాస్తులను విజయనగరం కలెక్టరేట్ దగ్గర గల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. లైసెన్సు పొందిన వారు సంవత్సరానికి రూ.55 లక్షలు ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఒకవ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా ఇవ్వవచ్చని తెలిపారు. ఈనెల 28న విజయనగరంలో నిర్వహించే లాటరీ ద్వారా లైసెన్స్‌దారుని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

సురవరానికి ఘననివాళి

బొబ్బిలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకరరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ నాయకులు తెలిపారు. బొబ్బిలి జెండామహల్ సెంటరులో శనివారం పట్టణ సీపీఐ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సుధాకరరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులుఅర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోలీసు, వెంకట సత్యనారాయణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు తమటాల అప్పలనాయుడు, రాయితి సత్యం పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా పోరాడుతాం

బొబ్బిలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అన్యాయం జరిగితే వారికి అండగా నిలిచి పోరాడుతామని జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగులకు ఒక్క కలంపోటుతో పెన్షన్లను రద్దుచేస్తామని లేఖలిచ్చి ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేసిందని ఆరోపించారు.విజయనగరం ఉమ్మడిజిల్లాల్లో 10వేలమందికి పెన్షన్లరద్దు పేరుతో నోటీసులిచ్చారని, ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం మాటమార్చిందని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, నాయకులు రమేష్‌నాయుడు, గోపాలరావు, భాస్కరరావు, సావు వెంకటమురళీ కృష్ణారావు, శాంతకుమారి పాల్గొన్నారు.

రెండున్నరేళ్లయినా పూర్తికాలే!

(3వ పేజీ తరువాయి)



సర్వీసు రోడ్డు స్థలంలో తొలగించాల్సిన ఆక్రమణలు

నడిబొడ్డున సుమారు వందేళ్ల కిందట నిర్మించిన ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) కాల పరిమితి పూర్తి కావడంతో, దాని స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి రైల్వే అధికారులు ప్రతిపాదించారు. దీని కోసం రైల్వే శాఖ రూ.11 కోట్లు మంజూరు చేసింది. 2023 మార్చి 20న రైల్వే ఉన్నతాధికారులు ఈ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రధాన వంతెన నిర్మాణం దాదాపు పూర్తయినప్పటికీ మిగతా పనులు ఇంకా పూర్తి కాలేదు. అప్రోచ్ రోడ్డు, దానికి అనుసంధానంగా నిర్మించాల్సిన సర్వీసు రోడ్డు విషయంలో వివాదం తలెత్తింది. బ్రిడ్జికి సమీపంలో రైల్వే ట్రాక్‌ను ఆనుకొని ఉన్న రిక్షా కాలనీ, కొత్తఅగ్రహారం ప్రాంతాలకు ఇప్పటి వరకూ పాత బ్రిడ్జి పక్కనుంచి మార్గం ఉంది. ఈ రెండు ప్రాంతాల ప్రజలు ఈ రోడ్డు మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే, కొత్తగా ఆర్వోబీ నిర్మిస్తుండడంతో ఈ రోడ్డు మూత పడే పరిస్థితి ఏర్పడింది. రిక్షా కాలనీ, కొత్తఅగ్రహారం ప్రాంతాలకు రహదారి సౌకర్యం యథావిధిగా కొనసాగాలంటే, మెయిన్ రోడ్డులో ఉన్న ఆక్రమణలు తొలగించాలి. వాటి తొలగింపుపై ప్రస్తుతం వివాదం నడుస్తోంది. సర్వీసు రోడ్డు నిర్మాణం కోసం తమకు తగినంత స్థలం అప్పగించాలని ఇప్పటికే రైల్వే అధికారులు ప్రతిపాదించడంతో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి, ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ ఇచ్చారు. ఎమ్మెల్యే కళావెంకటరావు కూడా ఆక్రమణదారులతో మాట్లాడి, ఆక్రమించిన స్థలంలో కనీసం పది అడుగుల స్థలాన్ని సర్వీసు రోడ్డు కోసం వదులుకోవాలని సూచించారు. అయితే, ఆ పని మాత్రం ఇప్పటి వరకూ జరగలేదు. దీంతో సర్వీసు రోడ్డు, ఆర్వోబీ అప్రోచ్ రోడ్డు పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. కొత్త ఆర్వోబీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసిన సమయంలోనే ఆక్రమణల తొలగింపుపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి ఉంటే, ఇప్పుడింత జాప్యం జరగకపోయేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వారికి ముందు చూపు లేకపోవడంతో రెండున్నరేళ్లయినా బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడం లేదు. దీంతో విశాఖ, విజయనగరం వైపు నుంచి చీపురుపల్లి మీదుగా రాజాం వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్వోబీ పనులు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

ధరల పట్టికలు ఏర్పాటుచేయండి

సీతానగరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో ఎరువులు నిల్వలు, ధరల పట్టికలను ఏర్పాటుచేయాలని అధికారులు కోరారు.ఈ మేరకు శనివారం సీతానగరంలోని ఎరువులు దుకాణాల్లో రెవెన్యూ అధికారి ప్రసన్నకుమార్, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం.రాజేష్, ఏవో ఎస్.అవినాష్‌లుతనిఖీలు నిర్వహించారు. గోదాముల్లో దస్త్రాలతో పాటునిల్వలను పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ నిల్వలు ఉంచితే వారిపై 6ఏ కేసు నమోదు చేస్తామని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని చెప్పారు.